ప్రజలకు అండగా 'సాక్షి'
నేడు ఇల్లెందు డీఎస్పీతో ఫోన్ – ఇన్


చంద్రభాను

ఇల్లెందు: ఇటీవల చోరీ ఘటనలు పెరుగుతున్నాయి. ప్రస్తుతం దసరా సెలవులు వచ్చాయి. ఇళ్లకు తాళాలు వేసి పండుగకు ఇతర ప్రాంతాలకు వెళ్తుండడంతో చోరీలు పెరిగే అవకాశముంది. చోరీల నివారణతో పాటు పండుగ సమయంలో ఎక్కడ పడితే అక్కడ మద్యం సేవించకుండా కట్టడి చేసేలా పోలీసులు చర్యలు చేపడుతున్నారు. ఈ సమయాన తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవడంతో పాటు సమస్యలను ప్రజలు నేరుగా ఇల్లెందు డీఎస్పీ ఎస్.చంద్రభాను దృష్టికి తీసుకెళ్లేలా 'సాక్షి' ఫోన్ ఇన్ నిర్వహిస్తోంది.

సాక్షి ఫోన్ ఇన్

ఫోన్ చేయాల్సిన సమయం :
26-09-2025, శుక్రవారం
ఉదయం 10 నుంచి 11 గంటల వరకు
ఫోన్ నంబర్ :
87126 82007

సింగరేణి ద్వంద్వ వైఖరి

నాడొక తీరు.. నేడొక తీరు
- నోరుమెదపని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలు
- అలియాస్ పేర్ల మార్పిడి విషయంలో యాజమాన్యం తీరుపై విమర్శలు
- ఉద్యోగాల కోసం పోరుబాట పట్టిన కార్మిక కుటుంబాలు


హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద నిరసన తెలుపుతున్న అలియాస్ కుటుంబ సభ్యులు (ఫైల్)

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం అలియాస్ పేర్ల మార్పిడి విషయంలో నాడు, ఒక తీరు, నేడు మరో తీరును అవలంబిస్తోంది. ఈ క్రమంలో సుమారు రెండు వేల కార్మిక కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. సుమారు నలభై ఏళ్లుగా సంస్థ అభివృద్ధికి పాటుపడిన సమయంలో రానీ సమస్య.. కార్మికుడి సర్వీసు అనంతరం తన కుమారుడికి ఉద్యోగం ఇచ్చే ప్రక్రియలో భాగంగా మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు ఉద్యోగాలు ఇచ్చే సమయంలో కొర్రీలు పెట్టటం సరైంది కాదని కార్మికులు వాపోతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి సింగరేణి వ్యాప్తంగా ఆందోళనకు కార్మికులు, వారి కుటుంబ సభ్యులు సిద్ధమవుతున్నారు. చిన్న చిన్న కారణాలతో సింగరేణి వ్యాప్తంగా సుమారు రెండు వేల మంది కార్మికుల ఉద్యోగాలను విజిలెన్స్ విభాగం నిలిపివేస్తోందని, ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి నుంచి కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, యూనియన్ నాయకులు వరకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా.. యాజమాన్యం కనికరించటం లేదని కార్మిక కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయి, తమ కుటుంబ సమస్యలు తీరతాయని ఆశించిన తల్లితండ్రుల ఆశ నిరాశగా మారి, కుదిరిన పెళ్లిలు సైతం నిలిచిపోయే పరిస్థితులు సింగరేణి వ్యాప్తంగా ఎదురవుతున్నాయని మనోవేదన చెందుతున్నారు. దిగిపోతే వచ్చిన పైసలు, ఇటు ఉద్యోగం రాక రూ.లక్షలు ఖర్చవు తున్నాయని, పిల్లల భవిష్యత్‌కు భరోసా లేకుండా పోతోందని కార్మిక కుటుంబాలు మదనపడుతున్నాయి.

13 ఏళ్లుగా ఎదురుచూపులు..
సింగరేణి సంస్థలో పనిచేసే కార్మికులు అలియాస్ పేరుతో ఉన్న కార్మికులకు న్యాయం చేస్తామని 2012 ఎన్నికల్లో టీబీజీకేఎస్ ఎన్నికల్లో హామీల వర్షం కురిపించింది. అధికారంలోకి వచ్చి తరువాత ఆ హామీలను విస్మరించింది. అదే క్రమంలో అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ ప్రభుత్వం, యూనియన్ పదవీకాలం పూర్తయ్యే వరకు అదిగో.. ఇదిగో.. అంటూ కాలం వెళ్లబుచ్చింది. 2023లో అధికారంలోకి వచ్చిన కొత్తప్రభుత్వం కూడా ఎన్నికల ముందు హామీల వర్షం కురిపించి గద్దెనెక్కి రెండేళ్లు అవుతోంది. అయినా అలియాస్ పేర్లమార్పిడి హామీని అమలు చేయలేక పోయిందని, ఫలితంగా రెండువేల కార్మిక కుటుంబాలు ఇబ్బంది పడుతున్నా పట్టించుకునే వారు లేరని, మా బతుకులు ఇంతేనా అని ఆవేదన చెందుతున్నారు.

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఉద్యోగ అవకాశం కల్పించాలి...
సుమారు ఆరేళ్ల క్రితం మెడికల్ ఇన్‌వాలిడేషన్ పూర్తై ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంటే విజిలెన్స్ విభాగం అధికారులు జ్యుడీషియల్ స్థాయిలో నానా ప్రశ్నలతో పలుమార్లు ఇళ్ల మీదకు వచ్చి తమ పేర్ల గురించి ఆరా తీసి, సమీపంలో ఉన్న వారి ముందు తమను అగౌరవపరిచే విధంగా ప్రశ్నల వర్షం కురిపిస్తున్న తీరు చూస్తే సింగరేణి ఉద్యోగం వద్దు.. మరేదైన కూలీ పనిచేసుకుంటే మేలు అనే విధంగా విజిలెన్స్ విచారణ ఉందని, తాము సంస్థలో పనిచేసి అభివృద్ధికి సహకరించిన కార్మికులమని, ఇతర దేశాల నుంచి వచ్చిన మిలిటెంట్లం కాదని, ఈవిధంగా రెండుపేర్లు ఉన్నావారందరికీ వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఒక్క అవకాశం కల్పించి ఉపాధి కల్పించాలని వేడుకుంటున్నారు.

ఏరియాలోనే పరిష్కరించాలి...



సింగరేణి సంస్థలో పనిచేసిన ఉద్యోగులకు సమస్యలు పరిష్కరించడానికి ఐఆర్‌పీఎం, వెల్ఫేర్ వింగ్ విభాగాలు ఉన్నాయి. వీరితో చర్చించి ఫైనల్ చేయాల్సిన యాజమాన్యం దిగిపోయిన కార్మికుడి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వొద్దనే సంకల్పంతో విజిలెన్స్‌కు రాసి ఏళ్ల తరబడి జాప్యం చేస్తోంది.
– రియాజ్ అహ్మద్, హెచ్ఎంఎస్ జనరల్ సెక్రటరీ

వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలి...



నలభై ఏళ్ల సంస్థలో పనిచేసిన కార్మికుడి ఉద్యోగం తన కుమారుడికి ఇవ్వమంటే కొర్రీలు పెట్టడం సరికాదు. ఈ విధానానికి యాజమాన్యం స్వస్తి చెప్పాలి. సంస్థలో పనిచేసినంత కాలం లేని తప్పిదాలు ఉద్యోగం ఇచ్చే క్రమంలో ఏందుకు.. యాజమాన్యం పునరాలోచించాలి.
– మాధవనాయక్, బీఎంఎస్ జాతీయ నాయకుడు

ఎమ్మెల్యేను కలిసిన డైలీవేజ్ వర్కర్లు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందు: 14 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పని చేస్తున్న డైలీవేజ్, ఔట్ సోర్సింగ్ వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని గిరిజన శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామీ ఇచ్చారు. గురువారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యను రాకను గమనించి వర్కర్లు మెయిన్ రోడ్ హైస్కూల్ వద్ద ఆందోళన శిబిరం నుంచి రోడ్డు వెంట నిలబడి ఆందోళన చేశారు. గమనించిన కనకయ్య తన వాహనం ఆపి ధర్నా వద్దకు చేరుకున్నారు. వర్కర్లు అందజేసిన వినతిపత్రాన్ని తీసుకుని వారితో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోరం కనకయ్య గిరిజన శాఖ మంత్రితో ఫోన్‌లో మాట్లాడారు. దసరా అనంతరం సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి కృష్ణ, పాయం ముత్తయ్య, నాగేశ్వరరావు, లక్ష్మయ్య, లక్ష్మీనారాయణ,స్వామి, రామకళ, పద్మ, అబ్బులు, నాగులు తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకలకు ఏర్పాట్లు

టేకులపల్లి: తెలంగాణ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య టేకులపల్లి ఎంపీడీఓకు సూచించారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని రామాలయం వద్ద బతుకమ్మ ఘాట్, ఆలయం ఎదుట బతుకమ్మ ఆడే స్థలాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యే ఆదేశాలతో ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి టేకులపల్లి, గోలియాతండా పంచాయతీ కార్యదర్శులను పిలిచి బాధ్యతలు అప్పగించారు. దీంతో కార్యదర్శులు ఉప్పు దీప్తి, ప్రశాంత్ టేకులపల్లి, గోలియాతండా, దాసుతండా పంచాయతీల వర్కర్లను పిలిపించి హుటాహుటిన వేడుకలకు ఏర్పాట్లు చేయించారు. బతుకమ్మ ఘాట్‌ను శుభ్రం చేయించారు. బతుకమ్మ ఆడే ప్రాంగణాన్ని చదును చేయించారు. తోరణాలు కట్టించి, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. నీళ్లు చల్లి ముగ్గులు వేయించారు. ఏర్పాట్లకు మూడు బిచ్చు, ఇస్లావత్ రెడ్యానాయక్, ఆత్మ కమిటీ చైర్మన్ బోడ మంగీలాల్ సహకరించారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ ధన్‌సింగ్

ఇల్లెందురూరల్: స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహించినా పంచాయతీ కార్యదర్శులు నిర్వహణకు సిద్ధంగా ఉండాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండల పరిషత్‌కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎంపీటీసీ, సర్పంచ్‌ల రిజర్వేషన్ ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు ఉన్నతాధికారులు చెబుతున్నారని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సమర్థవంతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. తమ పరిధిలోని పోలింగ్ బూత్‌లను మరోసారి పరిశీలించి ఏమైనా అసౌకర్యాలు గుర్తిస్తే సరిచేసుకోవాలని, సిబ్బందిని కూడా అప్రమత్తం చేయాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆలయంలో ఎస్‌ఐ పూజలు


ఎస్‌ఐకు పట్టువస్త్రాలు అందిస్తున్న పూజారి

జూలూరుపాడు: కాకర్ల శ్రీ రుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి ఆలయాన్ని గురువారం జూలూరుపాడు ఎస్‌ఐ బాదావత్ రవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయన కుమారుడు నాని పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఎస్‌ఐను సత్కరించారు. పూజారి వరుణ్, గ్రామస్తులు చావా వెంకటరామారావు, అల్లాడి లింగారావు, వందనపు సత్యనారాయణ, మెంతుల కృష్ణ, మిర్యాల రమేష్ తదితరులు ఉన్నారు.

నేడు ప్రభుత్వ కాలేజీలో పేరెంట్స్ మీటింగ్

పాల్వంచరూరల్: బస్వతారక కాలనీ గ్రామపంచాయతీ వీరునాయక్ తండా సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పసుపులేటి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.
టేకులపల్లి: టేకులపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు విద్యార్థుల తల్లిదండ్రులు – అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనం (పేరెంట్స్ టీచర్స్ మీటింగ్) ఉంటుందని తల్లిదండ్రులు సకాలంలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ బి.సులోచనా రాణి తెలిపారు. ఈ మేరకు గురువారం అధ్యాపకులు విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి ఆహ్వానపత్రాలు అందించారు. విద్యార్థుల హాజరు, సామర్థ్యం, ప్రగతి నివేదిక, అధ్యాపకుల పనితీరు తెలుస్తాయని తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

రక్తదాన శిబిరం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రియదర్శిని డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం జాతీయ సేవా సమితి, రోటరీ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్‌బాబు, రోటరీ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జమ్ములమూడి అబ్రహం మాట్లాడుతూ రక్తదానం యువత సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో జక్కుల రవికుమార్, శ్రీరామనేని చలపతిరావు, నయీం పాషా, రాయల వివేక్, డాక్టర్ లావణ్య, కాశీమళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా మిషన్ భగీరథ


బోడు గ్రామంలో తవ్వి వదిలేసిన గుంత

టేకులపల్లి: అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బోడు గ్రామంలో మిషన్ భగీరథ అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ ఇష్టారాజ్యం ప్రజలకు శాపంగా మారింది. నీటి సౌకర్యం లేదని ప్రజలు అడిగితే స్పందించిన అధికారులు... వారం రోజుల క్రితం గోతులు తవ్వి పైపులు వేసి వాటిని పూడ్చకుండానే వదిలేశారు. మొక్కుబడిగా రెండు రోజులు నీరు సరఫరా చేశారు. అవి ఇళ్లకు నీరు చేరకపోగా లీకులై తాగునీరు వృథాగా పోతోంది. నాలుగు రోజుల నుంచి నీరు లేక జనం నానా తంటాలు పడుతున్నారు. గోతులు పూడ్చకపోవడంతో మనుషులు, పశువులు ఆ గోతుల్లో పడే ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

జూలూరుపాడు: పడమటినర్సాపురం గ్రామంలో గురువారం జూలూరుపాడు పోలీసుల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసచారి మాట్లాడుతుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అపరిచిత నంబర్ల నుంచి ఫోన్ వస్తే లిఫ్ట్ చేయవద్దన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్, పాన్ కార్డు నంబర్లు ఇవ్వరాదని, సెల్ ఫోన్‌కు ఓటీపీ నంబర్ వచ్చిందని ఎవరైనా గుర్తుతెలియని, పరిచయం లేని వ్యక్తులు అడిగితే ఇవ్వొద్దన్నారు. అదేవిధంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం కారణంగా ప్రమాదాలు జరుగుతాయన్నారు. ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ తప్పని సరిగా ఉండాలన్నారు.

జీఎస్టీపై అవగాహన సదస్సు

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సేవ పక్షం – 2025లో భాగంగా గురువారం కొత్తగూడెం ఐఎంఏ హాల్‌లో జీఎస్టీ తగ్గింపుపై మేధావులు, వర్తక, వ్యాపారులతో అవగాహన సదస్సు నిర్వహించారు. రాష్ట్ర కోశాధికారి దేవకి వాసుదేవరావు, జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజలందరూ బీజేపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారన్నారు. ప్రధానంగా పేదలకు, మధ్యతరగతి ప్రజలకు భారంగా నిలిచిన జీఎస్టీని తగ్గించి ఊరట కలిగించినట్లు చెప్పారు. భారతదేశంలో ఉత్పత్తయ్యే వస్తువులనే ఈదేశ ప్రజలు వినియోగిస్తే ఆర్థికంగా ప్రపంచ దేశాలకు ధీటుగా భారత్ తయారవుతుందన్నారు. చిన్న తరహా పరిశ్రమలను మేకిన్ ఇండియా, స్టాండ్ అప్ ఇండియా, వంటి పథకాలతో యువతకు స్టార్టప్ కంపెనీలకు ఎక్కువ అవకాశాలు ఇచ్చి ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం భారతీయ జనతా పార్టీ ప్రభుత్వమని అన్నారు. జీవీకే మనోహర్‌రావు, సతీష్ కుమార్, గొడుగు శ్రీధర్, పైడిపాటి రవీందర్, జల్లారప శ్రీనివాస్, ఎమూరి శివ, శ్రీను, శంకర్‌బాబు పాల్గొన్నారు.

ధాన్యం బోనస్ కోసం పోరాటం

ఇల్లెందు: ప్రభుత్వం గత ఏడాది రైతులకు వరి ధాన్యం రూ.500 బోనస్ అందజేస్తామని ప్రకటించి ఏడాది కాలం గడిచినా అందించలేదని ప్రజాపంథా మాస్‌లైన్ అనుబంధ అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయూకేఎస్) ఆరోపించింది. గురువారం ఇల్లెందులోని ఎల్లన్న విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బుర్ర వెంకన్న, శ్రీరాం కోటయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం గతేడాది ప్రకటించిన ధాన్యం బోనస్ మాట ఎత్తటం లేదన్నారు. ఆరు గ్యారంటీలతో పాటు 420 హామీలు ప్రకటించిందని తెలిపారు. అధికారం చేజిక్కిన తర్వాత వాటిని విస్మరించిందని విమర్శించారు. ఈ సమస్యపై 29న ఏఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు. బానోతు వీరన్న, మోడెం రాంబాబు, ఆందావత్ బాలు, భుక్యా పాషా పాల్గొన్నారు.

రాజకీయ జోక్యంతో కార్మికులకు నష్టం



గేట్ మీటింగ్‌కు హాజరైన కార్మికులు

సింగరేణి(కొత్తగూడెం): మితిమీరిన రాజకీయ జోక్యంతో కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ఏఐటీయూసీ గుర్తింపు సంఘం నాయకులు ఆరోపించారు. గురువారం కొత్తగూడెం ఏరియాలోని పీవీకే–5 ఇంక్‌లైన్ వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. సింగరేణి లాభాల వాటా విషయంలో ప్రభుత్వం, యాజమాన్యం కలిసి కార్మికులను మోసం చేసిందన్నారు. వాస్తవ లాభాలు రూ.6400 కోట్ల నికర లాభాలు రాగా, రూ.4వేల కోట్లు సంస్థ 1భివృద్ధికి పక్కన పెట్టటం రాజకీయ కుట్ర అన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కనీసం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికులకు ఒక్కరోజు జీతం రూ.590 ఉండగా, రూ.500 బోనస్ సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో మల్లికార్జున్‌రావు, వీరస్వామి, కత్తెర్ల రాములు, హుమాయిన్, సందెబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై పాలకవర్గాల కుట్ర

సింగరేణి(కొత్తగూడెం): అక్టోబర్ 11, 12 తేదీలలో నల్లొండలో శ్రామిక భవన్‌లో జరగనున్న మహిళా సంఘం రాష్ట్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని, పీఓడబ్ల్యూ నాయకురాలు అందే మంగ పిలుపునిచ్చారు. గురువారం కొత్తగూడెంలోని జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. 50 ఏళ్లుగా మహిళా సంఘం మహిళల హక్కులపై అనేక పోరాటాలు నిర్వహించి సాధించిందన్నారు. బ్రాహ్మణ హిందూ భావజాలం పేరుతో మహిళలను వంటింటికే పరిమితం చేసే విధంగా ఈ పాలకవర్గాలు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే సనాతన ధర్మం పేరుతో మహిళలను ఇంటికే పరిమితం చేసే కుట్ర జరుగుతోందన్నారు. నాగలక్ష్మి, సంధ్య, రాములమ్మ, కరుణ, రాధ, వెంకటమ్మ, సుప్రియ పాల్గొన్నారు.

ఘనంగా స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం


సింగరేణి ఆస్పత్రిలో శుభ్రం చేస్తున్న ఉద్యోగులు

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఒక గంట పబ్లిక్ ప్రాంగణాలు, కార్యాలయాల్లో పరిసరాలను పరిశుభ్రం చేస్తున్నారు. గురువారం మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు నిర్వహించగా, ఎంపీడీఓ బైరు మల్లేశ్వరి ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. ఆకస్మికంగా వచ్చిన ఎమ్మెల్యే కోరం కనకయ్య స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఎంపీఓ జీఎల్ గణేష్ గాంధీ, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ తిరుపతయ్య పాల్గొన్నారు.

సింగరేణి ప్రధానాస్పత్రిలో..
కొత్తగూడెంఅర్బన్: సింగరేణి వ్యాపితంగా నిర్వహిస్తున్న స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం సింగరేణి ప్రధానాస్పత్రిలో ఉద్యోగులు సామూహిక శ్రమదానం చేసి పరిసరాలను శుభ్రం చేశారు. జీఎం(పర్సనల్) వెల్ఫేర్ – సీఎస్ఆర్ కిరణ్‌కుమార్, సీఎంఓ కిరణ్‌రాజ్ కుమార్, సీఎంఓఏఐ ప్రెసిడెంట్ టి.లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: స్వచ్ఛత హీ సేవా సంకల్పం నెరవేర్చడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలని జిల్లా ఆడిట్ ఆఫీసర్ మండల ప్రత్యేకాధికారి జి.శ్రీనివాస్ అన్నారు. మండల పరిధి జగన్నాథపురం గ్రామపంచాయతీలోని పెద్దమ్మగుడి సమీపంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ప్రత్యేకాధికారి పాల్గొని చెత్తను తొలగించి మొక్కలు నాటారు. మాట్లాడుతూ ఆరోగ్యకరమైన సమాజంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, తడి పొడిచెత్తను వేర్వేరుగా ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఎంపీఓ చెన్నకేశవులు, ఏపీఓ రంగా, కార్యదర్శి కృష్ణవేణి, సీసీ శ్రీను పాల్గొన్నారు.

పాత ఆర్డీఓ కార్యాలయంలో...
స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక పాతఆర్డీఓ కార్యాలయం, గిరిజన ఇంజనీరింగ్ కార్యాలయం పరిసరాల్లో ఉద్యోగులు చెత్తను తొలగించి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈ మధుకర్, ఏఈలు శ్రీకాంత్, యోగేష్, యశ్వంత్ పాల్గొన్నారు.

కొత్త గనులు ప్రారంభించాలి

ఇల్లెందు: సింగరేణి పుట్టినిల్లు ఇల్లెందులో నూతన గనులు ప్రారంభించాలని, ఇల్లెందును పరిరక్షించుకోవాలని ఎన్డీ అనుబంధ ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు సాధినేని వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం జీఎం కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. మాట్లాడుతూ బొగ్గు బావులకు పట్టినిల్లు ఇల్లెందులో నూతన బావులు ప్రారంభించి ఇల్లెందుకు కాపాడాలని కోరారు. 140 ఏళ్ల చరిత్ర కలిగిన ఇల్లెందులో అపారమైన బొగ్గు నిక్షేపాలు ఉన్నాయని తెలిపారు. 21 ఇంక్లైన్ మైన్, జేకే ఓసీ మూసి వేశారని, కేటీసీ ప్రైవేట్‌పరం చేస్తున్నారని పేర్కొన్నారు. ఇల్లెందు మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. సింగరేణిని పరిశ్రమగా గుర్తించకుండా వ్యాపార సంస్థగా చేస్తూ కొందరు అధికారులు ఇల్లెందు ఏరియా మనుగడథలేకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇల్లెందు జేకే ఓసీలో బొగ్గు నిక్షేపాలు ఉన్నా పూర్తిగా తొలిగించారని, పూసపల్లి, కేటీసీలో కొత్త మైన్లు ఏర్పాటు చేసి సింగరేణి ద్వారానే బొగ్గు తవ్వకాలు చేపట్టాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని జీఎం కార్యాలయంలో అందజేశారు. కె.శ్రీనివాస్, తుపాకుల నాగేశ్వరరావు, కొక్కు నాగేశ్వరరావు, ఎండీ రాసుద్దీన్, తోడేటి నాగేశ్వరరావు, వరప్రసాద్, కాపు కృష్ణ, కొప్పుల శ్రీనివాస్, డి.మోహన్‌రావు, అంజయ్య, పోషం బాబు, వీరన్న, నూనేశ్వరరావు, సుధాకర్ పాల్గొన్నారు.